# పోర్టులను కార్పొరేటు సంస్థలకు కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ 'భారత నౌకాశ్రయాల బిల్లు - 2021'

**ప్రస్తుతం** వునికిలో వున్న భారత నౌకాశ్రయాల చట్టం 1908 ప్రకారం, చిన్న నౌకాశ్రయాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వున్నాయి. 'భారత నౌకాశ్రయాల బిల్లు-2021'కి కేంద్ర ప్రభుత్వం చట్టరూపమిస్తే ప్రస్తుత సలహామండలిగా వున్న 'రాష్ట్ర సముద్రయాన అభివృద్ధి మండలి' (ఎస్ఎమ్‌డిసి) చిన్న నౌకాశ్రయాల నియంత్రణా సంస్థగా పనిచేయటం ప్రారంభిస్తుంది. అంటే, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో వున్న చిన్న నౌకాశ్రయాల యాజమాన్యం, ఇతర అధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్ఎమ్‌డిసికి, అంటే కేంద్ర ప్రభుత్వం, దాని అనుయాయుల పరిధిలోకి వెళ్ళిపోతాయి.

విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్తు వంటి అన్ని రంగాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వాల హక్కులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం గుంజివేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండానే రైతులను వారి భూములలోనే పాలేర్లుగా మార్చే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. రైతాంగం ఈ చట్టాలను నిరసిస్తూ అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు పంపిణీ విభాగం (డిస్కమ్)లలో ప్రైవేటు కంపెనీలకు లైసెన్సులు ఇవ్వటానికి నిర్ణయించింది. విద్యుత్తు పంపిణీ కంపెనీలు కేంద్ర ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తున్నాయి. ఈ విషయాల్లో ప్రజాభిప్రాయ సేకరణ అనే వాటికి ఎలాంటి తావులేదు. ప్రజల నుండి పెరుగుతున్న నిరసనలు ఒకవైపున వుంటుండగానే, కేంద్ర ప్రభుత్వం మరింత ఏకపక్షంగా నిరంకుశంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు, దేశ ప్రజానీకం ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలి.

చిన్న పోర్టులను కేంద్రం చేతిలోకి తీసుకోవటాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి వ్యతిరేకించాడు. ఇటీవలే అతను కోస్తా తీరప్రాంతంలోని 9 రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులకు లేఖ రాస్తూ కేంద్రానికి వారి అసమ్మతిని కూడా తెలపవలసినదిగా కోరాడు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమైనదని, ఒకవేళ ఆ బిల్లు చట్టరూపం తీసుకుంటే, పోర్టుల అభివృద్ధిపై, యాజమాన్యంపై, పన్నులపై, ఆదాయంపై రాష్ట్రాలు తమ హక్కును కోల్పోతాయని, కావున చిన్నతరహా నౌకాశ్రయాలు ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో కొనసాగాలని నొక్కి చెప్పాడు. ఒడిషా, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ బిల్లును వ్యతిరేకించాయి. ఏమైనా రాష్ట్రాల హక్కుల కోసం గట్టిగా నిలబడి పోరాడగలిగిన స్థితిలో ఈ రాష్ట్రాలు లేవు. ఈ రాష్ట్రాలలోని ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనం కంటే తమతమ రాజకీయ ప్రయోజనాలకు, తమ ప్రభుత్వాలను పరిరక్షించుకోవటానికే ప్రాధాన్యతనిస్తాయి.

### ఈ బిల్లులోని ప్రధానాంశాలు

నౌకాశ్రయాల రక్షణ, భద్రత, కాలుష్య నియంత్రణ, వాటి నిర్వహణా సామర్థ్యము, మనుగడ సాగించగలగటం వంటి అంశాలపై అంతర్జాతీయ నౌకాయాన ఒప్పందాలకు అనుగుణంగా ఈ బిల్లును రూపొందించారు. పోర్టులను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకంటూ ఎస్ఎమ్‌డిసిలకు అప్పగిస్తున్నారు. నౌకాయాన విభాగ వ్యవస్థ అభివృద్ధికి, పోర్టులను అత్యధికంగా వినియోగించటానికి తీసుకోవలసిన చర్యలను కూడా అందులో పేర్కొన్నారు. దేశంలో ఏ ప్రాంతంలోనైనా తగిన స్థలాలలో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పరచుకునే అధికారం ఈ మండలికి ఇచ్చారు. పోర్టు ఆస్తులు, సేకరణ, అమ్మకాలు, కేటాయింపులు, ఒప్పందాలు, వీటి అమలుకు సంబంధించిన అన్ని అంశాలపైన ఈ మండలికి అన్ని హక్కులు వుంటాయి. దీనర్థం అన్ని చిన్న పోర్టులూ కేంద్ర ప్రభుత్వ అదుపులోకి వెళ్ళటం జరుగుతుంది.

ఈ మండలి ఉనికిలోకి వచ్చినప్పటి నుండి, రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఇప్పటివరకూ వుంటూ వచ్చిన పోర్టులకు చెందిన భూములు, ఆస్తులు, నిధులు, ఆదాయం మొదలైనవన్నీ ఈ బోర్డుకు బదిలీ అవుతాయి. ఈ పోర్టులలో పనిచేసే ఉద్యోగులంతా ఈ బోర్డుల పరిధిలోకి బదిలీ అవుతారు. ఈ బిల్లుకు సంబంధించిన ముఖ్యమైన అంశాలివి. ఈ పోర్టుల ద్వారా రాష్ట్రాలు పొందే ప్రయోజనాలన్నీ కోల్పోవటం జరుగుతుంది.

రాష్ట్రాలు రాచరిక సంస్థానాల వలె మిగిలిపోయి, కేంద్ర ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ వుండాలి. రాష్ట్రాల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పే పాలక, ప్రతిపక్ష పార్టీలు, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ అధికారాల కేంద్రీకరణను వ్యతిరేకించి, పోరాడాలి. కానీ వీరికి ప్రజలపట్ల అంకితభావం, సమగ్రత లేవనేది అందరికీ తెలిసిన సత్యమే. కేంద్రంతో సఖ్యతగా మెలగకపోతే కేంద్రం నుండి రావాల్సిన నిధులు రావేమోనని, సిబిఐ, ఇ.డి. వంటివాటిపై కేంద్రానికున్న అదుపు ద్వారా వాటిని ప్రయోగించి తమపై దాడులు, వేధింపులు సాగిస్తారేమోననే భయంతో వారు తమ స్థానాలను కాపాడుకోవటానికే పరిమితమౌతున్నారు.

అదేవిధంగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు (సవరణ) బిల్లు – 2020ని వ్యతిరేకిస్తున్నాయి. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్ర శాసనసభలు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశాయి మినహా ఈ బిల్లు రద్దుకోసం నిర్మాణాత్మకంగా తీసుకున్న చర్యలేమీ లేవు.

పాలకులు తీసుకువచ్చే ప్రజావ్యతిరేక సంస్కరణల భారమంతా అంతిమంగా ప్రజలమీదే పడుతుంది. ఉనికిలో వున్న కనీస హక్కులను కూడా వారు కోల్పోతారు. చర్చలు జరిపే అవకాశాలు కూడా వారు కోల్పోతారు. పోర్టులను కార్పొరేటు దిగ్గజమైన ఆదానీ గ్రూపు, సెజ్ కంపెనీ నిర్వహిస్తాయి. సెజ్ చట్టం–2005 ప్రకారం, ఈ సెజ్‌లలోని కంపెనీలలో పనిచేసే కార్మికులకు ఎలాంటి కార్మిక చట్టాలూ వర్తించవు. ఉద్యోగులంతా ఉద్యోగ భద్రత లేకుండా వలస కార్మికుల స్థితికి కుదించబడతారు.

రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, రాష్ట్రాల ఆదాయ వనరులన్నింటినీ గుంజివేసుకుంటూ, సామ్రాజ్యవాదుల నౌకాయాన ప్రయోజనాల కనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భారత నౌకాశ్రయాల బిల్లును ప్రజలు – ముఖ్యంగా తీరప్రాంత ప్రజానీకం; రాష్ట్ర ప్రభుత్వాలు – ముఖ్యంగా తీరప్రాంత రాష్ట్రాల ప్రభుత్వాలు వ్యతిరేకించి వెనక్కుగొట్టాలి.